సాక్షి ప్రకాశం

సోమవారం । 30 । అక్టోబర్ । 2023



వంట తంటాలకు చెల్లు!

పాఠశాలల్లో వంట చేసేందుకు నాణ్యమైన పాత్రలు ఇచ్చేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఇప్పటికే కొన్ని పాఠశాలలకు పంపిణీ చేశారు.

- 8లో..



సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేద్దాం

జిల్లాలో సామాజిక బస్సు యాత్రను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, బుర్రా మధుసూదన్ యాదవ్ పిలుపునిచ్చారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
34.3/26.4

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగ మంచు ఎక్కువగా ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కనిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ గుర్తింపు

కనిగిరి రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాకు నాక్ గుర్తింపు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ఉషారాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ కళాశాలకు ప్రతిష్టాత్మకమైన ×బీ గ్రేడ్‌× అక్రిడేషన్ గుర్తింపు రావడం వల్ల కొత్త కోర్సులు ప్రారంభించేందుకు, మౌలిక వసతులు మెరుగుపరుచుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఈ బీ గ్రేడ్‌కు 5 ఏళ్ల కాలపరిమితి ఉంటుందన్నారు. గ్రేడ్ సాధించేందుకు ఎంతో కృషి చేసిన, సహకరించిన నాక్ కో ఆర్డినేటర్ డి. విజయకుమారి, కళాశాల సిబ్బందిని ప్రిన్సిపాల్ అభినందించారు. కళాశాల అభివృద్ధికి సహకరించిన అభివృద్ధి కమిటీ సభ్యులకు, పూర్వ విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

పత్తి గరిష్ట మద్దతు ధర రూ.7,020

ఒంగోలు సెంట్రల్: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఆధ్వర్యంలో మార్కాపురం మార్కెట్ యార్డ్‌లో పత్తి కొనుగోలు కేంద్రాన్ని నవంబర్ తొలి వారం నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా అగ్రి ట్రేడ్ మార్కెటింగ్ అధికారి కేవీఎస్ ఉపేంద్రకుమార్ తెలిపారు. 24.5-25.5 ఎంఎం మైక్రో నైర్ 4.3-5.1కు కనీస మద్దతు ధర రూ.6,620, అలాగే 29.5-30.5 ఎంఎం మైక్రో నైర్ 3.5-4.3కి రూ.7,020గా నిర్ణయించినట్లు వెల్లడించారు. పత్తి విక్రయించే రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ చేయించి ఉండాలని, తమ పేరును ఆర్బీకేలో నమోదు చేయించుకోవాలని స్పష్టం చేశారు. తేమ శాతం 8 నుంచి 12 లోపల మాత్రమే ఉండాలని చెప్పారు. ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులు తమ శాంపిల్‌ను మార్కాపురం మార్కెట్ యార్డ్‌లో లేదా జిల్లాలో నోటిఫై చేసిన మార్కెట్ యార్డ్, జిన్నింగ్ మిల్లులో చూపి మద్దతు ధర పొందవచ్చని వివరించారు. రైతులు తమ పత్తిని లూజు పద్ధతిలో లేదా గోనె సంచుల్లో మాత్రమే తీసుకురావాలన్నారు. పత్తిని ప్లాస్టిక్ సంచుల్లో నింపి తీసుకొస్తే సీసీఐ కొనుగోలు చేయదని చెప్పారు.

జు జిట్సు జిల్లా జట్టు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న వెంకట సుబ్రహ్మణ్యం

కనిగిరి రూరల్: జు జిట్సు చాంపియన్‌షిప్ జిల్లా స్థాయి జట్టును ఆదివారం కనిగిరిలో ఎంపిక చేశారు. అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎస్‌కే యాసీన్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీలకు రిఫరీలుగా వి.చిన్న గోపి, సయ్యద్ అర్షద్ బాషా వ్యవహరించారు. జూ జిట్సు నివాజ్ అండర్-10, 12, 14 బాలికల విభాగంలో ఎస్.కౌశిక పావని, పి.రాజేశ్వరి, పి.రాజ్యలక్ష్మి, కె.మానస, ఆర్.జ్ఞాన దీక్ష, అలాగే బాలుర విభాగంలో ఎస్.మన్విక్, బి.హేమంత్‌సాయి, ఎస్‌కే అబ్దుల్ హమీద్, డి.ఆదిత్య, బి.శ్రీనాథ్, సయ్యద్ ఖలీద్, జి.మహేష్, కె.యోగేశ్వరరావు, ఎస్‌కే హర్షద్, ఎస్‌కే అబ్దుల్ ఖాదర్, ఎస్.తేజ, ఎం.దాసు బాబు ఎంపికయ్యారు. వీరు నవంబర్ 25, 26 తేదల్లో కనిగిరిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని యాసీన్ తెలిపారు. జిల్లా జట్టును అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దరిశి వెంకట సుబ్రహ్మణ్యం అభినందించారు.




చంద్ర గ్రహణం.. ఆవిష్కృతం

చంద్ర గ్రహణం జిల్లాలో స్పష్టంగా కనిపించింది. శనివారం అర్ధరాత్రి 1:04 నుంచి 2:23 గంటల వరకు వివిధ రకాలుగా చంద్రుడు కనిపించాడు. గ్రహణం సందర్భంగా శనివారం మధ్యాహ్నం మహానివేదిన తర్వాత మూసివేసిన ఆలయాలను ఆదివారం ఉదయం తెరిచి సంప్రోక్షణ చేసి పూజలు నిర్వహించారు.

- సాక్షి, ఒంగోలు

నకిలీ దందా.. దామచర్ల చుట్టూనే..!

జిల్లాలో సంచలనం సృష్టించిన నకిలీ డాక్యుమెంట్ల వ్యవహారం ప్రతిపక్ష టీడీపీ చుట్టూ తిరుగుతోంది. ఈ కేసులో కీలకంగా ఉన్న వరలక్ష్మి..దామచర్లకు ముఖ్య అనుచరురాలు. ఆమెకు స్టాంప్ వెండర్ లైసెన్సు ఇప్పించడం దగ్గర నుంచి దుకాణం ప్రారంభం చేసే వరకు దామచర్ల దగ్గరుండి చూశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత దామచర్ల తనకు అనుకూలమైన అధికారులను రిజిస్ట్రేషన్ శాఖలో పెట్టుకొని ఈ దందా అడ్డూ అదుపు లేకుండా సాగించినట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఇప్పటి వరకు పట్టుబడిన వారిలో 8 మంది టీడీపీ నేతలు ఉన్నారు. మిగిలిన వారిలో కూడా టీడీపీ సానుభూతిపరులే ఉన్నట్లు సిట్ దర్యాప్తులో వెలుగు చూసినట్లు తెలుస్తోంది. అయితే వాస్తవాలను కప్పిపుచ్చుతూ ఎల్లో మీడియా వేదికగా అసత్య కథనాలను వండి వార్పిస్తున్నారు.



దామచర్లతో పెద్దిశెట్టి వరలక్ష్మి



టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే..

నకిలీ డాక్యుమెంట్ల వ్యవహారం మొత్తం టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే సాగినట్లు ఇప్పటి వరకు సిట్ దర్యాప్తులో తేటతెల్లమైంది.. ఇప్పటి వరకు 18 కేసులు నమోదు చేసి దాదాపు 25 మంది వరకు అరెస్టు చేశారు. వారిలో టీడీపీ నాయకులు దాదాపు ఏడెనిమిది మంది ఉన్నారు. మిగతా వాళ్లలో టీడీపీ సానుభూతి పరులే అధికం. టీడీపీ నాయకుడు బాపట్ల వెంకటేశ్వర్లు, అసదుల్లా, రాయపాటి ఏలియా, రాయపాటి అచ్యుత్, కారాని దుర్గాతో పాటు పలువురు ఉన్నారు. రాజాపానగాలరోడ్డుకు చెందిన డాక్యుమెంట్ రైటర్ సురేష్ కూడా 10 రోజుల నుంచి పరారీలో ఉన్నాడు. ఈ కేసులో డాక్యుమెంట్ల రైటర్ల పాత్ర సైతం ఉన్నట్లు సిట్ దర్యాప్తులో తేలినట్లు సమాచారం. దీంతో నగరానికి చెందిన పలువురు డాక్యుమెంట్లు రైటర్లు పరారీలో ఉండగా పోలీసులు గాలిస్తున్నారు.

వరలక్ష్మి కోసం పోలీసుల ముమ్మర గాలింపు...

దస్తావేజుల కుంభకోణంలో వరలక్ష్మి పాత్ర వెలుగుచూడడంతో ఆమె అజ్ఞాతంలోకి వెళ్లి పోయింది. రాజాపానగాలరోడ్డులో నివాసం ఉంటే వరలక్ష్మి కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. ఎస్పీ మలికాగర్గ్ నేతృత్వంలోని సిట్ బృందం ఆమె కదలికలపై నిఘా పెట్టింది. అయితే టీడీపీలోని ప్రధాన నాయకులు ఆమెను తమ సంరక్షణలో ఉంచుకొని కాపాడుతున్నట్లు సమాచారం. సెల్‌ఫోన్లు, ఫోన్ నంబర్లు మారుస్తూ ఇతర ప్రాంతాలకు వెళుతున్నట్లు పోలీసులు గుర్తించారు. వరలక్ష్మితో పాటు ఆమెకు ఆశ్రయం కల్పించిన వారి కదలికలపై కూడా సిట్ నిఘా ఉంచినట్లు విశ్వసనీయ సమాచారం. వరలక్ష్మి విక్రయించిన దస్తావేజులు కోర్టుల్లో కేసుల రూపంలో కొన సాగుతున్నట్లు కూడా సిట్ బృందానికి సమాచారం వచ్చింది. అనేక సమస్యలకు, ఆస్తులు వివాదాల్లోకి వెళ్లటానికి కూడా వరలక్ష్మి విక్రయించిన దస్తావేజులు ప్రధానంగా ఉన్నటు దర్యాప్తులో వెలుగులోకి వస్తున్నాయి. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డుల పరిశీలనలో 1100 దస్తావేజులను నిబంధనలకు విరుద్ధంగా విక్రయించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలినట్లు సమాచారం. ఇంకా వేల సంఖ్యలో దస్తావేజులను అక్రమార్కులకు విక్రయించినట్లు తెలుస్తోంది.



టీడీపీ నేత అసదుల్లా



టీడీపీ నేత బాపట్ల వెంకటేశ్వర్లు



టీడీపీ నేత మీరావళి

- కుంభకోణం మూలాలన్నీ టీడీపీలోనే
- అడ్డగోలుగా స్టాంపులు విక్రయించిన టీడీపీ నాయకురాలు వరలక్ష్మి
- వరలక్ష్మి మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు ప్రధాన అనుచరురాలు
- స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో స్టాంప్ వెండర్‌గా 11 ఏళ్లు కార్యకలాపాలు
- ఇప్పటి వరకు 1100 కు పైగా విక్రయించినట్లు సిట్ దర్యాప్తులో వెల్లడి
- 29వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్ అభ్యర్థిగా పోటీచేసి ఓటమిపాలు
- టీడీపీ నాయకులే నకిలీ డాక్యుమెంట్లు సృష్టికర్తలుగా అవతారం
- వాస్తవాలు వక్రీకరిస్తూ ఎల్లో మీడియాలో అసత్య కథనాలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: జిల్లాలో సంచలనం సృష్టించిన నకిలీ డాక్యుమెంట్లు, నకిలీ రబ్బరు స్టాంపుల కుంభకోణం టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే సాగాయి. సిట్ దర్యాప్తులో వెలుగుచూస్తున్న విషయాలను పరిశీలిస్తే టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఈ దందా సాగినట్లు తెలుస్తోంది. ప్రధానంగా 2014 నుంచి 2019 వరకు పచ్చ పార్టీ నేతల కనుసన్నల్లోనే మూడు డాక్యుమెంట్లు...ఆరు రబ్బరు స్టాంపుల చందంగా విరాజిల్లింది. ఈ దందా అంతా టీడీపీ మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ అండదండలతోనే ఒంగోలు నగరంతో పాటు జిల్లాలో వేళ్లూనుకుపోయింది. దామచర్ల నకిలీ డాక్యుమెంట్లు, స్టాంపుల కుంభకోణానికి రింగ్ లీడర్‌గా అవతారమెత్తాడు. ఈ కేసులో ఇప్పటికే కీలక వ్యక్తిగా ఉన్న టీడీపీకి చెందిన మహిళా నాయకురాలు, దామచర్ల ప్రధాన అనుచరురాలు పెరంమూరు వరలక్ష్మి అలియాస్ పెద్దిశెట్టి వరలక్ష్మికి 2012లో స్టాంప్ వెండర్ లైసెన్స్‌ను ఇప్పించాడు. అప్పటి నుంచే ఆమె దస్తావేజులను కేవలం నకిలీ డాక్యుమెంట్ల తయారీకి విక్రయిస్తూ ఈ రాకెట్‌కు తెరతీసింది. 2014లో ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత దామచర్ల తన అనుచరులను శాఖకు బదిలీ చేయించుకోవడంతో నకిలీ డాక్యుమెంట్ల కుంభకోణానికి అడ్డే లేకుండా పోయింది.

నకిలీల చేతిలో 1100 దస్తావేజులు

జిల్లా కోర్టు ప్రాంగణానికి సమీపంలో దస్తావేజులు విక్రయించేందుకు వరలక్ష్మికి ఒక దుకాణం కూడా ఏర్పాటు చేయించి దాన్ని దామచర్ల ప్రారంభించాడు. అప్పటి నుంచి దస్తావేజులను నకిలీ దందాలు చేసే ముఠాలకు మాత్రమే విక్రయిస్తూ భారీగా ఆర్జించింది. నకిలీ డాక్యుమెంట్లు, రబ్బరు స్టాంపుల కుంభకోణం వెలుగు చూడటంతో ఎస్పీ మలికాగర్గ్ సిట్‌ను ఏర్పాటు చేసింది. రంగంలోకి దిగిన సిట్ బృందం లోతైన దర్యాప్తు ప్రారంభించింది. దర్యాప్తులో స్టాంప్ వెండర్ వరలక్ష్మి అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. రిజిస్ట్రేషన్ శాఖ నిబంధనలను ఉల్లంఘించిన ఆమె నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసే వారికి, సంతకాలు ఫోర్జరీ చేసే వాళ్లకు మాత్రమే విక్రయించి సొమ్ము చేసుకుంది. సిట్ దర్యాప్తులో ఇప్పటి వరకు దాదాపు 1100 దస్తావేజులు నిబంధనలకు విరుద్ధంగా విక్రయించినట్లు తేలింది.

వరలక్ష్మికి పార్టీ పదవులెన్నో...

నకిలీ డాక్యుమెంట్లు, స్టాంపుల కుంభకోణంలో కీలక పాత్ర పోషించిన వరలక్ష్మికి రాష్ట్ర స్థాయిలో అంగన్‌వాడీ విభాగం అసోసియేషన్‌కు కార్యదర్శి పదవిని కూడా ఇప్పించాడు. ఆ తరువాత ఒంగోలు నగరపాలక సంస్థ ఎన్నికల్లో 29వ డివిజన్ పార్టీ అభ్యర్థిగా పార్టీ కోసం పనిచేసిన ముఖ్యులు నలుగురిని కాదని వరలక్ష్మికి టిక్కెట్ ఇప్పించాడు. టిక్కెట్ ఇప్పించటంతో పాటు ఎన్నికల ఖర్చు కూడా దామచర్లే పెట్టుకున్నాడన్న ప్రచారమూ అప్పట్లో జరిగింది. ఇవన్నీ పరిశీలిస్తే దామచర్ల ఆమెను ఎంతగా ప్రోత్సహించారో అర్థం చేసుకోవచ్చు.

రూ.100 దస్తావేజు రూ.10 వేలకు విక్రయం...

ఒంగోలు కేంద్రంగా దస్తావేజులు అక్రమ విక్రయాలకు పెద్దిశెట్టి వరలక్ష్మి కేంద్ర బిందువుగా మారింది. సాధారణంగా రూ.100 విలువైన దస్తావేజును అదే ధరకు అమ్మాలి. అయితే ఒక్కో చోట స్టాంపు వెండర్లు రూ.100 విలువ చేసే దస్తావేజుకు అదనంగా రూ.20 నుంచి రూ.40 వరకు వసూలు చేసుకుంటారు. ఈ విషయం రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు తెలిసినా పెద్దగా పట్టించుకునే వారు కాదు. అయితే వరలక్ష్మి మాత్రం రూ.100 దస్తావేజును రూ.10 వేలకు విక్రయించి భారీ స్థాయిలో సొమ్ము చేసుకుంది. దానికి ప్రధాన కారణం అప్పటి ఎమ్మెల్యేగా దామచర్ల అండదండలే.

ఎల్లో మీడియాను అడ్డంపెట్టుకుని..

సిట్ దర్యాప్తులో టీడీపీ నాయకుల పాత్రలు వెలుగు చూస్తుడడంతో అధికార పార్టీపై నెపం వేసేందుకు దామచర్ల ఎల్లో మీడియాను అడ్డం పెట్టుకున్నారు. నిత్యం అధికార పార్టీపై బురద జల్లుతూ వాస్తవాలను వక్రీకరిస్తూ పబ్బం గడుపుకుంటున్నారు. అసలు ఈ దర్యాప్తును కోరిందే ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి. దోషులు ఎవరున్నా వదిలిపెట్టవద్దని సీఎంఓలో ఉన్న కీలక అధికారులను సైతం ఆయన కోరిన విషయం తెలిసిందే. ఇవన్నీ పక్కన పెట్టి ఎల్లో మీడియా ప్రతి రోజూ ఒక కథనాన్ని వండి వారుస్తోంది.

పోలీసులు ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యమివ్వాలి

- ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: నిత్యం ఒత్తిడితో కూడుకున్న విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై తగిన ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన జాగ్రతలు తీసుకోవాలని ఎస్పీ మలికాగర్గ్ సూచించారు. పోలీసు సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పోలీసు కళ్యాణ మండపంలో పోలీసు సిబ్బంది, హోం గార్డులు, విశ్రాంత సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఉపాస్ సూపర్ స్పెషాలిటీ, సంఘమిత్ర, ఆర్కిడ్ ఫెర్టిలిటి హాస్పిటల్‌కు చెందిన స్పెషలిస్ట్ వైద్యులు సేవలు అందించారు. సాధారణ వ్యాధులతో పాటుగా ఎముకలు, నరాలు, జీర్ణాశయ వ్యాధులు, మూత్ర పిండాల సంబంధిత వ్యాధుల, గుండె జబ్బులు, ఊపిరితిత్తులు, చిన్నపిల్లల వ్యాధులు, ఫెర్టిలిటీ, గైనకాలజీ సమస్యలకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు విధులు చాలా కష్టంతో, ఒత్తిడితో కూడుకున్నది కావడంతో అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. దీని ప్రభావం పోలీసుల కుటుంబ సభ్యులపై ఉంటుంది కనుక ఆరోగ్యం విషయంలో శ్రద్ధ చూపాలని సూచించారు. నిత్యం ప్రజల భద్రత కోసం పనిచేసే పోలీసుల కొందరు నిర్లక్ష్యం వహించడం వల్ల చేజేతులా ఇబ్బందులను కొనితెచ్చుకుంటున్నారన్నారు. స్వల్ప అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సంబంధిత వైద్యుడిని సంప్రదించి తగిన చికిత్స తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, మంచి అలవాట్లను పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. పోలీసులు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని స్పష్టం చేశారు. మెడికల్ క్యాంపు ఏర్పాటుకు కృషి చేసిన ఎస్పీ మలికాగర్గ్‌కు, వైద్య సేవలు అందించిన డాక్టర్లకు పోలీసు కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపారు. శిబిరంలో పోలీసు యూనిట్ డాక్టర్ భానుమతి, సంఘమిత్రకు చెందిన డాక్టర్ షేక్ ఫైరోజ్, డాక్టర్ శివకుమార్, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ షాలిని, డాక్టర్ నాగమణి, ఉపాస్‌కు చెందిన డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ శ్రీనివాసులు, ఆర్కిఫెడ్‌కు చెందిన డాక్టర్ సింధూర వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఏఆర్ ఎస్పీ అశోక్ బాబు, డీఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాసు, ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి, తాలుకా సీఐ భక్తవత్సలరెడ్డి, ఆర్ఐలు హరిబాబు, శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బీపీ చెక్ చేయించుకుంటున్న ఎస్పీ మలికాగర్గ్

606 మంది రక్తదానం...

జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన రక్తదానం శిబిరాల్లో 606 మంది రక్తదానం చేసినట్లు ఎస్పీ మలికాగర్గ్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో, రక్తహీనత, ప్రాణాంతక వ్యాధుల్లో ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడిన వారవుతారని చెప్పారు. సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని కోరారు.

ఇలాగైతే కష్టం..!



టీడీపీ నాయకుల కోసం వేచి చూస్తున్న జనసైనికులు

- టీడీపీ, జనసేన సమన్వయ సమావేశానికి రెండు గంటలు ఆలస్యంగా వచ్చిన టీడీపీ నేతలు
- టీడీపీ నేతల తీరుపై జనసైనికుల అసంతృప్తి

ఒంగోలు అర్బన్: సమయపాలన పాటించకుంటే టీడీపీతో కలిసి నడవడం కష్టమని జనసైనికులు వారి అసంతృప్తి వ్యక్తం చేశారు. నగరంలోని స్థానిక ఎంస్ ఫంక్షన్ హాలులో ఆదివారం టీడీపీ, జనసేన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని ముందుగానే తెలిసినా అలవాటు ప్రకారం తెలుగుదేశం పార్టీ నేతలు దాదాపు రెండు గంటలు ఆలస్యంగా వచ్చారు. ఉదయం అరగంట ముందుగానే వచ్చిన జనసేన పార్టీ నేతలు ఇదేం ఖర్మ అంటూ వారిలో వారు బహిరంగంగానే టీడీపీ నేతలు సమయపాలన పాటించకుంటే వారితో కలిసి నడవడం కష్టమని మాట్లాడుకున్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమవ్వాల్సిన సమావేశం టీడీపీ నేతల ఆలస్యంతో మధ్యాహ్నం 1.00 గంటకు ప్రారంభమైంది. సమావేశానికి ఆలస్యంగా రావడంపై టీడీపీ నేతలు కనీసం మాట్లాడకుండా ఉండటం గమనార్హం. ఆలస్యంగా ప్రారంభమైన సమావేశం 4 గంటలకు ముగిసింది. అనంతరం మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. అయితే మీడియా సమావేశంలో వారి మధ్య సమన్వయంపై ఎటువంటి వివరాలు వెల్లడించకుండా కేవలం అధికార పార్టీపై విమర్శలు చేయడానికే ప్రాధాన్యం ఇచ్చారుకున్నారే తప్పా సమన్వయ కమిటీ సమావేశం వివరాలు కాని ఇరువురు కలిసి ఏ ప్రణాళికలు తయారు చేసారో వంటి అంశాలేవి మాట్లాడకపోవడం గమనార్హం.



వరల్డ్ ఫొటో జర్నలిజం డే సందర్భంగా ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫిక్ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 24న నిర్వహించిన రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి ఫొటోగ్రఫీ కాంపిటిషన్లో ఒంగోలు సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్ ఎం ప్రసాద్ ప్రోత్సాహక బహుమతి సాధించారు. దీపావళి వేడుకల్లో నరకాసుర వధ ఘట్టాన్ని సెల్‌ఫోన్లలో చిత్రీకరిస్తున్న ఫొటోకు ఈ అవార్డు దక్కింది నవంబర్ 1న విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో అవార్డు అందుకోనున్నారు.



ఎం ప్రసాద్

పౌరులకు చట్టాలపై అవగాహన అవసరం

- ప్రజా సంకల్ప వేదిక అధ్యక్షుడు రంగసాయిరెడ్డి



ఒంగోలు సిటీ: ప్రజాసంకల్ప వేదిక ఒక న్యాయ విజ్ఞాన సదస్సు అని సమాజంలోని ప్రతి పౌరుడికి చట్టాలపై కనీస అవగాహన అవసరమని ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మదిరె రంగసాయిరెడ్డి అన్నారు. ఒంగోలు రామ్‌నగర్‌లోని ప్రజా సంకల్ప వేదిక కార్యాలయంలో ఆదివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మదిరె రంగసాయిరెడ్డి మాట్లాడుతూ ఇతరుల హక్కులకు భంగం కలగకుండా ప్రతి ఒక్కరూ మెలగాలని సూచించారు. సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమన్నారు. పేదలు ఉచిత న్యాయ సేవలను పొందేందుకు అవకాశం ఉందన్నారు. ట్రాక్టర్, ఆటోలకు బీమా చేయించుకోవాలని సూచించారు. అనుకోకుండా ప్రమాదాలు జరిగినప్పుడు బీమా సొమ్ము ఆసరాగా ఉంటుందన్నారు. సమావేశంలో ఆర్టీఐ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

2న సొసైటీ పెట్రోల్ బంక్ ప్రారంభం


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పెట్రోల్ బంకు

యర్రగొండపాలెం: స్థానిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఐఓసీఎల్ పెట్రోల్ బంకు ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. నవంబరు 2వ తేదీన రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ చేతులమీదుగా పెట్రోల్ బంకును ప్రారంభించనున్నట్లు సొసైటీ కార్యనిర్వాహకుడు మేడగం వెంకటరెడ్డి తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వైఎం.ప్రసాద్‌రెడ్డి, జిల్లా సహకార శాఖ అధికారి పోలిశెట్టి రాజశేఖర్ తదితరులు పాల్గొంటారని చెప్పారు.

ఘాట్ రోడ్డులో ట్రాక్టర్ బోల్తా

- జామాయిల్ కర్రల కింద పడి రైతు మృతి


మృతి చెందిన కొండారెడ్డి

తర్లుపాడు: మండలంలోని తాడివారిపల్లి ఘాట్ రోడ్‌లో ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. తర్లుపాడు ఎస్సై వేముల సుధాకర్ తెలిపిన వివరాల మేరకు.. గిద్దలూరు సమీపంలోని పాదలకొండపల్లి గ్రామానికి చెందిన కొందరు రైతులు పొగాకు పందిరి అవసరాల కోసం జామాయిల్ కర్రలు కొనుగోలు చేసేందుకు హనుమంతునిపాడు మండలం వేములపాడు వచ్చారు. కొనుగోలు అనంతరం జమాయిల్ లోడుతో ట్రాక్టర్‌లో బయలుదేరారు. తాడివారిపల్లి ఘాట్ రోడ్డు వద్దకు ట్రాక్టర్ చేరుకోగానే ముందు టైరు పంక్చర్ కావడంతో అదుపుతప్పి ఓ వైపునకు ఒరిగిపోయింది. ఈ క్రమంలో ట్రాక్టర్ పైన ఉన్న రైతులు కింద పడగా గూడపురెడ్డి కొండారెడ్డి(42)పై కర్రలు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని ఎస్సై పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

కడుపునొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య

వెలిగండ్ల: కడుపునొప్పి తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం సాయంత్రం వెలిగండ్ల మండలం గన్నవరంలో చోటుచేసుకుంది. ఎస్సై మహేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గన్నవరం గ్రామానికి చెందిన బొప్పరాజు రోశయ్య(48)కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. రోశయ్యకు అప్పుడప్పుడు కడుపునొప్పి వస్తోందని, ఆదివారం తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఊరి వెలుపల ఉన్న చెట్టుకు ఉరివేసుకున్నాడని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వంట తంటాలకు చెల్లు!

- మధ్యాహ్న భోజన పథకానికి నాణ్యమైన వంట పాత్రలు
- జిల్లా వ్యాప్తంగా 2,365 పాఠశాలల్లో పంపిణీకి ఏర్పాట్లు
- ఆరు కేటగిరీలుగా పాఠశాలల విభజన
- వంట సిబ్బందికి తీరనున్న ఇబ్బందులు

పుల్లలచెరువు: రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో అనేక నూతన మార్పులకు శ్రీకారం చుట్టింది. డ్రాపౌట్లు తగ్గించడం, ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. గత ప్రభుత్వాలు పథకం నిర్వహణను గాలికొదిలేసినా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక పథకం రూపురేఖలు మార్చేశారు. మధ్యాహ్న భోజన మెనూపై ప్రత్యేక దృష్టి సారించారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వంట చేసే ఏజెన్సీలకు ఇబ్బందులు తప్పాయి. పాఠశాలల్లో వంట చేసేందుకు నాణ్యమైన పాత్రలు ఇచ్చేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. విద్యార్థుల సంఖ్య ఆధారంగా స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలను ఇప్పటికే కొన్ని పాఠశాలలకు పంపిణీ చేశారు. మరికొద్ది రోజుల్లో జిల్లాలోని అన్ని పాఠశాలలకు వంట పాత్రలు చేరనున్నాయి. 2010లో చివరిసారిగా మధ్యాహ్న భోజన పథకానికి వంట పాత్రలను అప్పటి ప్రభుత్వం పంపిణీ చేసింది. ఆ తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్నే అస్తవ్యస్తంగా మార్చింది. అరకొరగా ఉన్న పాత్రలతోనే విద్యార్థులకు వంట చేయాల్సి వచ్చేది. కొన్ని పాఠశాలల్లో వంటపాత్రలు లేకపోవడంతో వాటిని ఏజెన్సీల నిర్వాహకులే సొంత ఖర్చులతో సమకూర్చుకున్న పరిస్థితి. వంట పాత్రలు లేక ఇబ్బందిగా ఉందని గత ప్రభుత్వంలో పాలకులకు ఏజెన్సీల నిర్వాహకులు ఎన్ని విజ్ఞప్తులు చేసినా పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత మెరుగ్గా అమలు చేయడమే కాకుండా కొత్త వంట పాత్రల పంపిణీకి చర్యలు చేపట్టారు.


పుల్లలచెరువు జెడ్పీ హైస్కూల్‌కు అందజేసిన నూతన వంట పాత్రలు


ప్రభుత్వ పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

2365 పాఠశాలలకు మంజూరు

జిల్లాలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్న 2,365 పాఠశాలలకు వంట పాత్రలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. విద్యార్థుల సంఖ్యను బట్టి వంట పాత్రల పంపిణీకి పాఠశాలలను ఆరు కేటగిరీలుగా విభజించారు. జిల్లాలో అన్ని పాఠశాలలకు పంపిణీ చేసేందుకుగాను అన్ని మండల కేంద్రాలకు పాత్రలను సరఫరా చేసి అక్కడి నుంచి పాఠశాలలకు చేరవేయనున్నారు. గరిష్టంగా 25 కిలోల వరకు అన్నం వండేలా ప్రాతలు అందిస్తున్నారు. వీటితో పాటు పల్లేలు, గిన్నెలు, గరిటెలను ప్రభుత్వం పాఠశాలలకు సరఫరా చేస్తోంది.



చాలా సంతోషంగా ఉంది

పదమూడేళ్ల క్రితం వంట పాత్రలు ఇచ్చారు. అవి కొన్నాళ్లకే పోయాయి. మా పాఠశాలలో 550 మంది విద్యార్థులు ఉన్నారు. వంట చేసేందుకు ఇబ్బంది పడుతుండటాన్ని గమనించి దాతలు కొన్ని పాత్రలు ఇచ్చారు. ఇంకా అవసరమైన వాటిని మేమే తెచ్చుకుంటున్నాం. ఇప్పుడు ప్రభుత్వం సరిపడినంత వంట సామగ్రి ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది.
– ఆరేపుల కవిత, కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకురాలు, పుల్లలచెరువు జెడ్పీ హైస్కూల్

అద్దంకిలో ఎస్‌జీఎఫ్ స్కేటింగ్ క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 31న అద్దంకి ఒలంపియన్ స్పోర్ట్స్ అకాడమీ మార్కెట్ యార్డు రెండో గోడౌన్‌లో నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.వనజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని, అండర్–11, అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలబాలికలు పాల్గొనవచ్చని పేర్కొన్నా. పూర్తి వివరాలకు ఫిజికల్ డైరెక్టర్ విష్ణుప్రసాద్ 8121820000ను సంప్రదించాలని సూచించారు.

పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు

ఒంగోలు: భారతీయ తపాలా శాఖ ఆధ్వర్యంలో డిజిటల్ ఇండియా ఫర్ న్యూ ఇండియా అనే అంశంపై నిర్వహిస్తున్న పోటీల్లో విద్యార్థులు తమ సామర్థ్యాన్ని పరీక్షించుకోవాలని డీఈఓ వీఎస్ సుబ్బారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు తపాలా సర్కిల్ స్థాయి, జాతీయ స్థాయిలో బహుమతులు అందజేస్తారని పేర్కొన్నారు. ఎన్వలప్ కేటగిరీ, ఇన్‌లాండ్ లెటర్ కేటగిరీల్లో నిర్వహించనున్న ఈ పోటీల్లో విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. వయసు ధ్రువీకరణ, రిజిస్టర్ లేదా స్పీడ్ పోస్టు ద్వారా ఎంట్రీలను సంబంధిత డివిజినల్ హెడ్ పోస్టాఫీసుకు ఈనెల 31వ తేదీలోగా పంపాలని సూచించారు. ఎంఈఓలు ఈ విషయాన్ని ప్రధానోపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు తెలియజేసి ఎక్కువ మంది పోటీల్లో పాల్గొనేలా చూడాలని స్పష్టం చేశారు.

హత్య కేసులో సాక్షులకు బెదిరింపు

- అరెస్టు చేసిన పోలీసులు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో గత ఏడాది చోటుచేసుకున్న దాడి, హత్య కేసులో సాక్ష్యం చెప్పవద్దంటూ సాక్షులను బెదిరిస్తున్న వ్యక్తిని ఆదివారం మార్కాపురం పట్టణంలోని కోర్టు సెంటరులో అరెస్టు చేసినట్లు ఒన్‌టౌన్ ఎస్సై కోటేశ్వర రావు తెలిపారు. ఎస్టేట్‌కు చెందిన నరేంద్ర ఒక కేసులో సాక్ష్యం చెప్పవద్దంటూ బెదిరిస్తున్నారన్న ఫిర్యాదుపై విచారించి అరెస్టు చేశామని చెప్పారు.

సామాజిక సాధికార బస్సు యాత్రను
విజయవంతం చేద్దాం

- పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చిన ఎమ్మెల్యేలు కేపీ, బుర్రా
- నవంబర్ 6న మార్కాపురం, 8న కనిగిరిలో బహిరంగ సభలు


మార్కాపురం పాత బస్టాండ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేపీ, నాయకులు


పార్టీ నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్

మార్కాపురం: సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు తరలిరావాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పిలుపునిచ్చారు. బస్సు యాత్ర నవంబర్ 6వ తేదీన మార్కాపురం చేరుకోనున్న సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ నేతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చరిత్రలో తొలిసారిగా సామాజిక న్యాయాన్ని పాటించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతే ధ్యేయంగా సామాజిక సాధికార బస్సు యాత్ర చేపట్టినట్లు తెలిపారు. గడిచిన 75 ఏళ్లలో జరగని అభివృద్ధిని ఈ నాలుగున్నరేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసి చూపించారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో దళితులను అవమానిస్తే సీఎం వైఎస్ జగన్ అక్కున చేర్చుకుని వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టారన్నారు. బస్సు యాత్రకు నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి పార్టీ శ్రేణులు హాజరయ్యేలా ఏర్పాట్లు చేయాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం పాత బస్టాండ్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మీర్జా షంషేర్ ఆలీబేగ్, మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, పార్టీ ప్రధాన కార్యదర్శి రవిచంద్ర, పొదిలి పట్టణ అధ్యక్షురాలు షేక్ నూర్జహాన్, కొనకనమిట్ల ఎంపీపీ మురళి, జెడ్పీటీసీ ఏడుకొండలు, పార్టీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి పీఎల్పీ యాదవ్, తర్లుపాడు మండల అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు, మండల జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, పొదిలి ఏఎంసీ మాజీ చైర్మన్ జి.శ్రీనివాసులు, కల్లం సుబ్బారెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, మోరా శంకర్‌రెడ్డి, పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: కనిగిరిలో నవంబర్ 8న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్ భవన్‌లో ఆదివారం పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకుల రెడ్డి అధ్యక్షతన పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గతంలో ఎన్నుడూ లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలతో దేశంలోనే ఆదర్శ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. ఆయా వర్గాలు రాజకీయంగా ఎదిగేందుకు మరిన్ని అవకాశాలు కల్పించారని చెప్పారు. బీసీలంటే బ్యాక్‌వర్డ్ కాదని, బ్యాక్ బోన్ అని అభివర్ణించి అండగా నిలిచారన్నారు. నవంబర్ 8న ఉదయం 10 గంటలకు బస్సుయాత్ర కనిగిరి మండలం యడవల్లి నుంచి ప్రారంభమవుతుందన్నారు. కనిగిరి చర్చి సెంటర్‌లో సుమారు 20 వేల మందితో సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు హాజరయ్యేలా చూడాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, సొసైటీ అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, పార్టీ నాయకులు బసిరెడ్డి పిచ్చిరెడ్డి, సీహెచ్ సాల్మన్ రాజు, మండల అధ్యక్షుడు జి.బొ్రరారెడ్డి, తిరుపతిరెడ్డి, వెంకటరెడ్డి, జేసీఎస్ పట్టణ కన్వీనర్ వేల్పుల వెంకటేశ్వర్లు, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ రాజీరెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల నాయకులు పాల్గొన్నారు.

చేయి చేయి కలిపితేనే రాజకీయ స్ఫూర్తి



మాట్లాడుతున్న యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర చైర్మన్ మేకల శ్రీనివాస చక్రవర్తి

- యానాదుల సంక్షేమ సంఘ రాష్ట్ర చైర్మన్ మేకల శ్రీనివాస చక్రవర్తి

ఒంగోలు: చేయి చేయి కలిపితేనే రాజకీయ స్ఫూర్తిని అందుకోగలమని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర చైర్మన్ మేకల శ్రీనివాస చక్రవర్తి పేర్కొన్నారు. స్థానిక ప్రకాశం భవనం వద్ద నుంచి జవహర్ నవోదయ వద్ద ఉన్న గిరిజన భవన్ వరకు ఆదివారం భారీ డప్పులు, వాయిద్యాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గిరిజన భవన్‌లో నిర్వహించిన రాజకీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 34 గిరిజన తెగల్లో 37 లక్షల మంది జనాభా ఉన్నారని, వారిలో 10 లక్షలకు పైగా యానాదులు ఉన్నారన్నారు. ఏపీలో ఉన్న గిరిజన తెగలన్నింటిలోకి యానాదులే అత్యధిక జనాభా అన్నారు. అయినా రాజకీయంగా యానాదుల అభ్యున్నతి కనిపించకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరి చిన పెంచలయ్య మాట్లాడుతూ 70కిపైగా నియోజకవర్గాలలో గెలుపు ఓటములను నిర్ణయించే సత్తా మన యానాదులకు ఉందన్నారు. దామాషా ప్రకారం నిధుల కేటాయింపులోను, ఎస్టీ కమిషన్‌లోను ప్రాతినిధ్యం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో త్వరలో జరిగే ఎన్నికల్లో యానాదులకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ పదవి ఇస్తామని ఎవరైతే మానిఫెస్టోలో పెడతారో వారికే మన మద్దతు ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండేటి వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ యానాదులకు చట్టసభలలో ప్రాతినిధ్యం కల్పించాలని, మైదాన ప్రాంతాలలో 5 ఎమ్మెల్యే స్థానాలను అన్ని రాజకీయ పార్టీలు ప్రకటించాలన్నారు. యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేసి రూ.500 కోట్లు కేటాయించాలన్నారు. నియోజకవర్గాల పునర్విభజనలో ఎస్టీలను కూడా జిల్లా యూనిట్‌గా తీసుకుని ఎమ్మెల్యే స్థానాలను కేటాయించాలని, మైదాన ప్రాంతాల్లోని యానాదులకు ప్రత్యేకంగా ఐటీఐ, బీఈడీ, నర్సింగ్ కాలేజీలను ఏర్పాటు చేయాలని పాలకులపై ఒత్తిడి తీసుకువద్దామని పిలుపునిచ్చారు. బోగస్ ఎస్టీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం ప్రభుత్వం జ్యుడీషియల్ కమిటీని వేయాలన్నారు. సమావేశంలో యానాది ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చేవూరి సుబ్బారావు, చేవూరి బ్రహ్మయ్య, యానాదుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కొమరగిరి మాల్యాద్రి తదితరులు పాల్గొని మాట్లాడారు.


సభకు హాజరైన యానాదులు

అ'పూర్వ' స్నేహానికి అర్ధ శతాబ్దం!

వారంతా అర్ధ శతాబ్దం క్రితం కలిసి చదువుకున్నారు. ఉద్యోగాలు చేసి, వ్యాపారాలు నిర్వహించిన వారంతా ఇప్పుడు రిటైర్మెంట్ దశకు చేరుకున్నారు. స్నేహితులంతా ఒకసారి కలవాలని భావించారు. ఈ అ'పూర్వ' ఘట్టానికి దొనకొండ, సంతనూతలపాడు జెడ్పీ హైస్కూళ్లు వేదికలయ్యాయి. ఆదివారం నాడు ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపిన స్నేహితులు అలనాటి చిలిపి చేష్టలను గుర్తుచేసుకుని మురిసిపోయారు.

దొనకొండ: స్థానిక జెడ్పీ పాఠశాలలో 1978–79వ సంవత్సరం 10వ తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆద్యంతం ఉల్లాసంగా సాగింది. 44 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని, ఉప్పొంగిపోయారు. తమ జీవితాల్లో సుఖసంతోషాలు, కుటుంబ యోగక్షేమాల గురించి స్నేహితులతో పంచుకున్నారు. గురువులు చెప్పిన మాటలను గుర్తుచేసుకున్నారు. మరణించిన స్నేహితుల ఆత్మ శాంతించాలని మౌనం పాటించారు. అనంతరం సినీ గీతాలకు ఉత్సాహంగా స్టెప్పులేసి సందడి చేశారు. పూర్వ విద్యార్థులు రైల్వే రిటైర్డ్ ఉద్యోగి జె.శ్రీనివాసరావు, ఆర్‌పీఎఫ్ ఏఎస్సై వావిరాల శ్రీనివాసరావు, బుక్కారపు సంజీవరాజ్ తదితరులు పాల్గొన్నారు.


దొనకొండ జెడ్పీ హైస్కూల్లో కలిసిన పూర్వ విద్యార్థులు

చీమకుర్తి: సంతనూతలపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో 1972–73వ సంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా సాగింది. డాక్టర్లు, ఉద్యోగాలు చేసి పదవీ విరమణ పొందిన వారు, వ్యాపారాల్లో స్థిరపడిన వారంతా 50 ఏళ్ల నాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. చీమకుర్తి మండలం పల్లామల్లిలో వృద్ధాశ్రమం నిర్వహిస్తున్న రిటైర్డ్ టీచర్ మద్దాలి సుబ్బారావును పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. డాక్టర్లు మణిమాల, రాఘవేంద్ర ప్రసాద్, ఇతర రంగాల్లో స్థిరపడిన వారంతా తమ కుటుంబాల యోగక్షేమాల గురించి పంచుకున్నారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలోని సరస్వతిదేవి విగ్రహానికి పూలమాలలు వేశారు.



రిటైర్డ్ టీచర్ సుబ్బారావును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు డాక్టర్ ప్రసాద్, భానుమూర్తి తదితరులు


సంతనూతలపాడు హైస్కూల్లో కలిసిన పూర్వ విద్యార్థులు